క్లుప్తంగా

హెచ్ఐవీ, టీబీపై అవగాహన

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో ఎయిడ్స్, టీబీపై గురువారం చైల్డ్ ఫండ్ ఇండియా ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురి ఇళ్లకు వెళ్లి రక్త నమూనాలు సేకరించారు. ఎయిడ్స్, టీబీల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముత్యం రెడ్డి, వైద్యసిబ్బంది సుగుణ, వనజ, సంస్థ సభ్యులు శశిమల, భోజన్న, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో మహాయజ్ఞం


యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలో నూతనంగా నిర్మించిన బీరప్ప ఆలయంలో మహాయజ్ఞం, పూజలు నిర్వహించారు. వేద పండితులు బబ్రు మహారాజ్ ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో విగ్రహ ఊరేగింపు నిర్వహించారు. శుక్రవారం బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి శ్రీనివాస్, పలువురు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ గ్రామానికి చెందిన ద్యావత్ ముత్తన్నకు ఇటీవల పాముకాటు వేసింది. వెంటనే కుటుంబసభ్యులు భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. గురువారం నిరుపేద అయిన ముత్తన్నను పుస్పూర్ సర్పంచ్ సంగెం నర్సయ్య పరామర్శించి చికిత్స కోసం రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు.

బాబా ఆలయంలో సందడి


కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కుంటాల: రెండో షిరిడీగా ప్రసిద్ధి గాంచిన మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా వివిధ గ్రామాల మహిళలు ఆలయానికి పాదయాత్రగా వచ్చి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

ముగిసిన సప్తాహం

భైంసారూరల్: మండలంలోని కుంసర గ్రామంలో గురువారం సప్తాహం ముగిసింది. చివరిరోజు గ్రామస్తులు శోభయాత్ర నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా మహిళలు మంగళహారతులు, ప్రధాన వీధులగుండా విఠలేశ్వర స్వామి చిత్రపటంతో శోభాయాత్రలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఖానాపూర్: నిర్మల్‌కు చెందిన ఎంబడి నవీన్ ఖానాపూర్‌లో గత నెలలో పాగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గురువారం ఖానాపూర్ ఎస్సై ఆర్.శంకర్ బాధితుడికి అందజేశారు. ఫోన్ పోయిన విషయమై బాధితుడు ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను గుర్తించామని ఎస్సై తెలిపారు. సెల్‌ఫోన్ పోతే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్సై సూచించారు.

కొండగట్టుకు స్వాములు


ఆలయం వద్ద దీక్షాపరులు

భైంసాటౌన్: భైంసాకు చెందిన పలువురు హనుమాన్ దీక్షాపరులు గురువారం కొండగట్టుకు తరలివెళ్లారు. మండల, అర్ధమండల దీక్ష పూర్తి చేసుకున్న స్వాములు ఈ మేరకు కిసాన్‌గల్లిలోని రోకడ్ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గురుస్వామి కోర్వ చిన్నన్న ఆధ్వర్యంలో ఇరుముడులతో కొండగట్టుకు తరలివెళ్లారు.

దీక్షాపరుల శోభాయాత్ర


నృత్యం చేస్తున్న దీక్షాపరులు

తానూరు: మండలంలోని బామ్నిలో గురువారం హనుమాన్ దీక్షాపరులు పల్లకి శోభాయాత్ర నిర్వహించారు. హనుమాన్ ఆలయంలో పూజల అనంతరం జైశ్రీరామ్, జై హనుమాన్ అంటూ వీధుల్లో నృత్యాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అందని పౌరసేవలు

- మండల కేంద్రంలోనే ధ్రువపత్రాల జారీ
- ఇబ్బందుల్లో ఆయా గ్రామాల ప్రజలు
- పట్టించుకోని అధికారులు
- పంచాయతీల్లో పూర్తికాని పనులు


ధర్మోరలో సరఫరా చేసిన టీఫైబర్ కేబుల్, ఇన్వర్టర్


మన్మద్ గ్రామ పంచాయతీలో పని చేయని కంప్యూటర్

లోకేశ్వరం: గ్రామపంచాయతీల ద్వారా పౌరసేవలు అందించాలని ప్రభుత్వం సంకల్పించి.. సరఫరా చేసిన కంప్యూటర్లు కార్యాలయాల్లో మూలన పడుతున్నాయి. కొన్నిచోట్ల పరికరాలు దెబ్బతిన్నాయి. మరికొన్ని చోట్ల బాగున్నప్పటికీ నెట్ సౌకర్యం, ప్రింటర్లు, స్కానర్లు లేక పౌరసేవలకు అంతరాయం కలుగుతోంది. దీంతో మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు వివిధ ధ్రువపత్రాల కోసం ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ-పంచాయతీ కింద ఎంపికైన పల్లెల్లోనూ అదే దుస్థితి నెలకొంది.

జిల్లాలో 116 పంచాయతీల్లోనే కంప్యూటర్లు..

పాలనలో పారదర్శకత, సేవల్లో వేగం పెంచాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల్లో ఈ పాలనకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి జిల్లాలో క్లస్టర్ పంచాయతీలకు ప్రభుత్వం కంప్యూటర్లను అందించింది. ప్రస్తుతం నిర్మల్ జిల్లాలో 396 గ్రామ పంచాయతీలు ఉండగా 116 పల్లెలకు కంప్యూటర్లు కేటాయించారు. జిల్లాలో 33 మంది కంప్యూటర్ ఆపరేటర్లుగా పని చేస్తున్నారు. ఇంత చేసినా ఇంటర్‌నెట్ సేవలు అందించకపోవడంతో ఈ వ్యవస్థ ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది.

కానరాని ఇంటర్‌నెట్ సౌకర్యం..

క్లస్టర్ పంచాయతీలకు ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించే పనులను గతంలో బీఎస్ఎన్ఎల్ వారికి అప్పగించారు. వారు కొన్నిచోట్ల కేబుల్ ద్వారా కనెక్షన్లు ఇచ్చి అర్ధంతరంగా నిలిపివేయడంతో మరో సంస్థకు బాధ్యతలు అప్పగించారు. వీరు కొన్నింటికీ కనెక్షన్లు ఇచ్చారు. మధ్యలో మిషన్ భగీరథ పైపులైన్ కోసం, సీసీ రోడ్లకు, రోడ్డు విస్తరణ పనులకు తవ్వకాలు చేపట్టడంతో చాలా చోట్ల కేబుల్ తీగలు తెగిపోయాయి. ప్రస్తుతం టీ-ఫైబర్ నెట్ సౌకర్యం కల్పించే పనులు కొనసాగుతున్నట్లు సమాచారం. జిల్లాలో 129 గ్రామ పంచాయతీలకు టీ-ఫైబర్ కనెక్షన్లు ఇచ్చారు. కానీ ఎక్కడా ఇంటర్‌నెట్ పని చేయడం లేదు.

కార్యదర్శులకూ ఇబ్బందులు..

పంచాయతీల్లో జనన, మరణ ధ్రువపత్రాలు, ట్రేడ్ లైసెన్సుల జారీ, వసూళ్లు చేసిన ఆస్తి పన్నుల రశీదులు, అభివృద్ధి పనులకు వెచ్చించిన నిధుల వ్యయం వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సి ఉండగా ఆన్‌లైన్ సదుపాయం లేక గ్రామ పంచాయతీ కార్యదర్శులే ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్లి అప్‌లోడ్ చేస్తున్నారు.

పని చేయడం లేదు



ధ్రువపత్రాల జారీతోపాటు పంచాయతీల్లో అభివృద్ధి పనులకు వెచ్చించిన నిధుల వ్యయం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు మండల కార్యాలయం వెళ్తున్నాం. టీ-ఫైబర్ కేబుల్, ఇన్వర్టర్లు అందజేశారు..కానీ ఇంటర్‌నెట్ పని చేయడం లేదు.

– రాఘవేందర్, గడ్‌చాంద కార్యదర్శి

స్థానికంగా అప్‌లోడ్ చేసుకోవాలి

కార్యదర్శులు పౌరసేవల ధ్రువపత్రాలను స్థానికంగా అప్‌లోడ్ చేసుకోవాలి. కొన్నిచోట్ల కంప్యూటర్లు నిరుపయోగంగా ఉన్నమాట వాస్తవమే. మరమ్మతులు, ప్రింటర్లకు నిధులు అవసరమైతే పంచాయతీ తీర్మానం చేసుకుని ఖర్చు చేసుకోవాలి. జిల్లాలో కేవలం 129 పంచాయతీ ల్లో టీ-ఫైబర్ కేబుల్, ఇన్వర్టర్లను అమర్చారు. ఇంటర్‌నెట్ పని చేయడం లేదు. – శ్రీలత, డీపీవో

భగీరథ నీరు సరఫరా చేయరా?

- మామడ సర్వసభ్య సమావేశంలో అధికారులపై సభ్యుల ఆగ్రహం


మాట్లాడుతున్న ఎంపీపీ అమృత

మామడ: మారుమూల గ్రామాలకు భగీరథ నీరు ఎందుకు సరఫరా చేయడం లేదని సంబంధిత అధికారులపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాథోడ్ అమృత అధ్యక్షతన మామడ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రచ్చకోట, తోటిగూడ గ్రామాల్లో భగీరథ నీరు సరఫరా కాక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని.. సమస్య పరిష్కరించాలని తాండ్ర ఎంపీటీసీ శరణ్య సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే సమస్య పరిష్కరిస్తామని సంబంధిత అధికారులు సమాధానమిచ్చారు. మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయంతో ఇబ్బందులు పడుతున్నామని న్యూలింగంపల్లి సర్పంచ్ గంగాధర్ అధికారుల దృష్టికి తీసుకురాగా సమస్య పరిష్కరిస్తామని విద్యుత్ అధికారి పేర్కొన్నారు. న్యూలింగంపల్లిలో పాఠశాలను దగ్గరగా ఉన్న కొరిటికల్ క్లస్టర్ నుంచి దూరంగా ఉన్న మామడ క్లస్టర్‌కు ఎందుకు మార్చారని సర్పంచ్ గంగాధర్ ప్రశ్నించగా.. పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఏనుగు లింగారెడ్డి, ఎంపీడీవో రమేశ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- భైంసా పట్టణ సీఐ ఎల్.శ్రీను
- జుల్ఫికర్‌గల్లీలో కమ్యూనిటీ కాంటాక్ట్


మాట్లాడుతున్న భైంసా పట్టణ సీఐ ఎల్. శ్రీను

భైంసాటౌన్: సైబర్ మోసాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ ఎల్. శ్రీను అన్నారు. గురువారం ఉదయం పట్టణంలోని జుల్ఫికర్‌గల్లీలో పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 59 బైక్‌లు, ఐదు ఆటోలు, నాలుగు ఫోర్ వీలర్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కాలనీవాసులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. అనవసర కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. అనుమానితులుంటే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు తిరుపతి, ఎండీ గౌసుద్దీన్, శ్రీనివాస్, పలువురు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'కంటివెలుగు' ప్రారంభం


రాంపూర్‌లో ప్రారంభిస్తున్న సర్పంచ్ గోవింద్‌రెడ్డి


శిబిరం పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటరమణ

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్‌లో సర్పంచ్ గోవిందరెడ్డి, కుస్లీ గ్రామంలో సర్పంచ్ స్వరూప గురువారం కంటివెలుగు శిబిరాలను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ చిన్న రామయ్య, ఎంపీడీఓ అల్లాడి వనజ, ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ శ్యామ్‌కుమార్, భూమేశ్, భోజన్న, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మామడ: మండలంలోని న్యూసాంగ్వి గ్రామంలో గురువారం కంటివెలుగు శిబిరాన్ని వైస్‌ఎంపీపీ ఏనుగు లింగారెడ్డి ప్రారంభించారు. అనంతరం వైద్యాధికారి అరుణ్ పలువురికి కంటి పరీక్షలు చేశారు. కార్యదర్శి అనసూయ, శ్రీనివాస్‌గౌడ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిబిరం పరిశీలించిన తహసీల్దార్..

తానూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కొనసాగుతున్న కంటి వెలుగు వైద్య శిబిరాన్ని గురువారం తహసీల్దార్ వెంకటరమణ పరిశీలించారు. ఇప్పటివరకు కంటిపరీక్షలు చేసుకున్న వారి వివరాలు తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి జలంసింగ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

- ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్


పెద్దబెల్లాల్‌లో కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే


కుంటాల: పెంచికల్‌పాడ్‌లో గజ్జారాం, నేతలు

కడెం: కొనుగోలు కేంద్రాల్లోనే పంట విక్రయించి రైతులు మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని పెద్దబెల్లాల్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యులు రఫీక్ అహ్మద్, సర్పంచ్ రమాదేవి, రైతుబంధు సమితి మండల కన్వీనర్ జీవారెడ్డి, సురేందర్, హసీబ్, తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని తురాటి గ్రామ సర్పంచ్ అశ్విని అన్నారు. డీసీఎంఎస్ ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్ష్మణ్, డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేశ్, ఖదీర్, సుధాకర్, గోవింద్‌రాజ్, శంకర్, శ్యామ్, వీడీసీ చైర్మన్ రాములు, నిర్వాహకుడు మురళీ తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్, విఠాపూర్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను గురువారం పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేశ్, సర్పంచ్‌లు రోజాబాయి, లక్ష్మీ, ఉప సర్పంచ్‌లు కిష్టయ్య, నవీన్‌రెడ్డి, ఏఈవో గణేశ్, డైరెక్టర్ గజ్జారాం, సీఈవో నాగభూషణం, రమేశ్, అశోక్, సుదర్శన్‌రెడ్డి, రవి, సాయారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో వచ్చేది బీజేపీ సర్కారే


హిప్పెల్లితండాలో ప్రచారం చేస్తున్న మోహన్‌రావ్

తానూరు: రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు బీజేపీ అధికారంలో వస్తోందని ఆ పార్టీ నాయకులు మోహన్‌రావ్ పటేల్ అన్నారు. గురువారం మండలంలోని హిప్నెల్లి, హిప్నెల్లితండా, ఎల్వి గ్రామాల్లో పల్లెపల్లెకు బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని వివరించారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తోందన్నారు. సీఎం కేసీఆర్ ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను విస్మరించారని పేర్కొన్నారు. అనంతరం హిప్నెల్లితండాలో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముథోల్ మాజీ ఎంపీపీ సుభాశ్ పటేల్, నాయకులు బోస్లే గోపాల్‌రావ్ పటేల్, జ్ఞానేశ్వర్, మొగ్గి జానేశ్వర్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుపై అవగాహన


మాట్లాడుతున్న హార్టికల్చర్ ఆఫీసర్ జావిద్ పాషా

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం ప్రియూనిక్(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. హార్టికల్చర్ ఆఫీసర్ జావిద్ పాషా మాట్లాడుతూ ఆయిల్‌పాం మొక్కలకు రోజు కోసారి నీటిని అందించాలని సూచించారు. మండల వ్యాప్తంగా 200 ఎకరాలల్లో ఆయిల్ పాం సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. అంతకుముందు సస్యరక్షణ చర్యలు, చీడపీడల నివారణ, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. సాగుకు ఆసక్తి కల్గినవారు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిన్న రామయ్య, గోపిడి గంగారెడ్డి, ప్రియూనిక్ (ఇండియా)ప్రైవేట్ లిమిటెడ్ ఏరియా మేనేజర్ వెంకటేశ్వర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు శ్రీనివాస్, క్రాంతి, రైతులు పాల్గొన్నారు.

బోనమెత్తిన కొండుకూర్


బోనాలతో పోచమ్మ ఆలయానికి వెళ్తున్న మహిళలు


ద్యావతోల్ల విన్యాసాలు

కడెం: మండలంలోని కొండుకూర్ గ్రామంలో నూతన ఆలయంలో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు ముగిశాయి. గురువారం బోనాల పండుగ వైభవంగా నిర్వహించారు. మహిళలు, యువతులు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్లతో ప్రధాన వీధుల గుండా ఆలయానికి వెళ్లారు. మట్టి కుండల్లో వండిన నైవేద్యాన్ని మోదుగ ఆకుల్లో అమ్మవారికి సమర్పించారు. వేడుకలో భాగంగా ద్యావతోల్ల నృత్యాలు, విన్యాసాలు అకట్టుకున్నాయి. పాడి,పంటలు, పిల్ల,జల్లను సల్లంగ సూడాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

13లోగా ఎంట్రీ ఫాంలు సమర్పించాలి

కడెం: సీఎం కప్ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు ఈనెల13వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా ఎంట్రీ ఫాంలను ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించాలని మండల ఇన్‌చార్జి పీడీ గంట క్రాంతి తెలిపారు. ఈనెల 15 నుంచి 17 వరకు నిర్వహించే కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో 15 నుంచి 36 ఏళ్లవారు పాల్గొనవచ్చన్నారు. ఈమేరకు పోటీలకు మైదానం సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాలి

భైంసారూరల్: భైంసా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈనెల 15 నుంచి 17 వరకు నిర్వహించే మండలస్థాయి సీఎం కప్ పోటీలకు క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం క్రీడా మైదానం చదును చేయించి ఏర్పాట్లు చేస్తున్నారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

15నుంచి సీఎం కప్ పోటీలు

కుభీర్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఈనెల 15 నుంచి 17వరకు సీఎం కప్ కోసం క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కవి.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. 15 ఏళ్ల పైబడిన యువకులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. ప్రతి గ్రామపంచాయతీ నుంచి ఒకే జట్టుకు అవకాశం ఉంటుందన్నారు. అథ్లెటిక్స్, కబడ్డీ, ఫుట్‌బాల్, వాలీబాల్, ఖోఖో పోటీలు ఉంటాయని.. ఆసక్తి కల్గినవారు మండల పరిషత్ కార్యాలయంలో సీఆర్పీ ఆనంద్‌ను సంప్రదించి ఈనెల 13లోగా ఎంట్రీ ఫాం పూర్తి చేసి ఇవ్వాలని సూచించారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు సన్మానం


వినోద్‌రావును సన్మానిస్తున్న న్యాయవాదులు

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన కల్వకుంట్ల వినోద్‌రావును గురువారం ప్రథమ శ్రేణి కోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ వినోద్‌రావు రెండోసారి మూడేళ్ల కాలానికి జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులవడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోర్టు ఎస్సై సక్రియ నాయక్, ఏఎస్సై శంకర్, సీనియర్ న్యాయవాదులు గోవర్ధన్, గంగాధర్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. ప్రమాదకరంగా సెప్టిక్‌ట్యాంక్



లోకేశ్వరం: మండలంలోని జోహర్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్డి నిరుపయోగంగా మారింది. అక్కడ సెప్టిక్‌ట్యాంక్‌కు మూత లేకపోవడంతో పశువులు, పిల్లలు అందులో పడే అవకాశం ఉంది. ప్రమాదం జరుగక ముందే సెప్టిక్ ట్యాంక్‌కు మూతను బిగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: చంద్రకాంత్, లోకేశ్వరం ఎంఈవో, ఫోన్: 95029 36560

రామాలయానికి రూ.ఐదు లక్షల విరాళం


జెడ్పీటీసీ దంపతుల్ని సన్మానిస్తున్న సభ్యులు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాం నగర్ కాలనీలో సీతారామచంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి బీజేపీ నియోజకవర్గ నాయకురాలు, పెంబి జెడ్పీటీసీ జాను బాయి-రమేశ్ దంపతులు గురువారం రూ.ఐదు లక్షల విరాళం అందజేశారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిటీ సభ్యుల సమక్షంలో విరాళం అందజేశారు. కార్యక్రమంలో బుక్క వెంకటేశ్, లాండేరి కిషన్, సతీశ్‌రావు దేశ్‌పాండే, పడాల రాజశేఖర్, నాయిని సంతోష్, రాములు, గంగాధర్, ఉపేందర్, శ్రావన్, సురేశ్, పవన్, శేఖర్, వేణు తదితరులు ఉన్నారు.